నేడు పిజిఆర్ఎస్ రద్దు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 24న సోమవారం జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను (పిజిఆర్ఎస్) జిల్లా అంతటా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ విషయాన్ని జిల్లావాసులు దృష్టిలో ఉంచుకుని సహకరించాలని ఆమె కోరారు.

అసెంబ్లీలో గళమెత్తేనా..!

పోలవరం నిర్వాసితులకు అరకొర పరిహారం

కౌలురైతుల చట్టం కార్యరూపం దాల్చేనా

పడకేసిన డెల్టా ఆధునికీకరణ

ఆక్వా, వరి రైతులకు ప్రోత్సాహకాలు కరువు

కొల్లేరు సమస్యలు లేవనెత్తేనా

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అసెంబ్లీలో ఎంఎల్ఎలు గళమెత్తుతారా.. లేక మౌనం వహిస్తారా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తిస్థాయిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనైనా జిల్లాలోని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా అని జనం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 80 శాతం ప్రజానీకానికి వ్యవసాయమే జీవనాధారం. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిన జనం గడిచిన ఎన్నికల్లో రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా మొత్తం అన్నింటిలోనూ కూటమి అభ్యర్థులనే జనం గెలిపించారు. తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. జూన్‌లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 2024 నవంబర్ 11న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. తక్కువ వ్యవధిలో బడ్జెట్ ప్రవేశ పెట్టడంతో జనం సైతం పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. ఈసారి 2025-26 పూరిస్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. జిల్లాలో పోలవరం నిర్వాసితుల సమస్య అత్యంత ప్రధానమైంది. ఇటీవల పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ కింద ప్రభుత్వం జిల్లాలోని నిర్వాసితులకు రూ.250 కోట్లు వరకూ జమ చేసింది. పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు కాకుండా రూ.6.25 లక్షల చొప్పున మాత్రమే జమ చేసింది. 2017 తర్వాత 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇవ్వలేదు. ఇంటికి సంబంధించిన పరిహారం సొమ్ము అందలేదు. కాలనీల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగలేదు. నిర్వాసితులకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయని, గ్రామసభలు నిర్వహించాలని డిఆర్సి సమావేశంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ప్రస్తావించిన సంగతి తెలిసిందే. పోలవరం నిర్వాసితుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి నిర్వాసితులకు న్యాయం జరిగేలా జిల్లాకు చెందిన ఎంఎల్ఎలు ఏం చేస్తారో వేచిచూడాలి.

కౌలుచట్టం పై గళమెత్తేనా..?

రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయసాగులో 70 శాతం వీరే సాగు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే ఏఒక్క సాయమూ కౌలురైతులకు అందడం లేదు. దీంతో కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. తాము అధికారంలోకి వస్తే కౌలురైతుల చట్టంలో మార్పులు చేసి న్యాయం చేస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తెలిపారు. తొలుత హడావుడి సైతం చేశారు. ఇప్పుడు నోరుమెదపడం లేదు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా కౌలుచట్టం కార్యరూపం దాల్చేనా అంటూ జిల్లాలోని కౌలురైతులు ఎదురుచూస్తున్నారు. అలాగే ధాన్యానికి బోనస్ ఇస్తే వరి రైతులకు ఊరట దక్కుతుంది. ఆక్వా రైతులకు మేత ధరల విషయంలో సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సాహకాలు అందించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపైనా ఎంఎల్ఎలు అసెంబ్లీలో ప్రస్తావించాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై మాట్లాడతారా?

జిల్లాలో ప్రధానంగా సాగునీటికి సంబంధించి డెల్టాలో ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉంది. గత ప్రభుత్వం ఆధునికీకరణపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. కూటమి ప్రభుత్వం అదేవిధంగా వ్యవహరిస్తోంది. వేసవి దగ్గరపడినా ఇప్పటి వరకూ డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. ఈ ఏడాదైనా పనులు జరుగుతాయో, లేదో అనుమానం నెలకొంది. అసెంబ్లీలో ఎంఎల్ఎలు దీనిపై మాట్లాడాల్సి ఉందని జిల్లాలోని రైతులు కోరుతున్నారు. మెట్ట ప్రాంతంలో చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాల పరిస్థితి అదేవిధంగా ఉంది.

కొల్లేరు సమస్యలు లేవనెత్తేనా?

రెండు జిల్లాల్లో మరో ప్రధానమైన సమస్య కొల్లేరు. సముద్రపు నీరు కొల్లేరులోకి రాకుండా మూడుచోట్ల రెగ్యులేటర్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. గత వైసిపి ప్రభుత్వం నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగలేదు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు. కొల్లేరులో చేపల చెరువులను అధికారులు మళ్లీ ధ్వంసం చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొల్లేరును మూడోకాంటూరుకు కుదించడంతోపాటు, కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. అయితే ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో జనం మరింత ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీలో కొల్లేరు సమస్యలను లేవనెత్తి తమకు అండగా నిలబడాలని అక్కడి జనం కోరుతున్నారు.

పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా కేంద్రమైన ఏలూరులో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల నిర్వహణకు ఆరు కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారని తెలిపారు. వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సిఆర్‌రెడ్డి మహిళా కళాశాల, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఉదయం పూట జరిగిన పరీక్షకు మొత్తం 4,415 మంది అభ్యర్థులకు 3,881 మంది (87.90 శాతం) హాజరవ్వగా, 534 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు మొత్తం 4,415 మంది అభ్యర్థులకుగాను 3,878 మంది (87.81 శాతం) అభ్యర్థులు హాజరవ్వగా 537 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అయితే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8.45 నిమిషాలకు గేట్లు తెరిచి అభ్యర్థులను లోపలికి అనుమతించినప్పటికీ 9.15 వరకు అభ్యర్థుల రాక మందకొడిగా సాగింది. ఆ తర్వాత అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఒక సిఐ స్థాయి అధికారి, ఇద్దరు ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని పరీక్షా కేంద్రాలను సందర్శించిన డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రతి కేంద్రం వద్దా అభ్యర్థులను గేటు బయట క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనంతరం లోపల కూడా మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి గదుల్లోకి అనుమతించారు. జిల్లా కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ ఉన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.



పరీక్షా కేంద్రంలో ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి తనిఖీలు

అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఎంఎల్సి ఎన్నికల్లో..

టిడిపికి పిడిఎఫ్ గుబులు..!

చాప కింద నీరులా పిడిఎఫ్ అభ్యర్థి

దిడ్ల వీర రాఘవులు ప్రచారం

పిడిఎఫ్‌కు అండగా ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజాసంఘాలు

ప్రచారంలో సర్వశక్తులు ఒడ్డుతున్న అధికార పార్టీ

ఊదరగొడుతున్న ఆడియో ఫోన్‌కాల్స్

ఎన్నిచేసినా అధికార పార్టీని వెంటాడుతున్న ఎన్నికల గుబులు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల్లో అధికార పార్టీ టిడిపికి పిడిఎఫ్ గుబులు పట్టుకుంది. అధికార పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి సిఎం నుంచి గ్రామస్థాయి నేతలంతా కలిసి సర్వశక్తులూ ఒడ్డుతున్నప్పటికీ ఎన్నికల భయం మాత్రం ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. అందుకు ప్రధాన కారణం ఎన్నికల బరిలో పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు నువ్వా.. నేనా అన్నట్లు ముందువరుసలో నిలవడమే.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల పరిధిలో 3.14 లక్షల మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. ఇప్పటి వరకూ ఉభయగోదావరి జిల్లాల్లో మూడుసార్లు పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికలు జరగ్గా రెండు సార్లు పిడిఎఫ్ అభ్యర్థులే గెలిచారు. ఉపాధ్యాయ ఎంఎల్సి ఎన్నికల్లో మూడుసార్లు పిడిఎఫ్ అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. ప్రస్తుతం జరుగుతున్న పట్టభద్రుల ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అదే తరహాలో ముందుకు సాగుతోంది. ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజాసంఘాలు పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా నిలిచి ప్రచారం చేస్తున్నారు. చాపకింద నీరులా పిడిఎఫ్ తన ప్రచారాన్ని సాగిస్తున్న తీరు అధికారపార్టీలో గుబులు రేపుతోంది. ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తుండడంతో పిడిఎఫ్ మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. విద్యావంతులైన గ్రాడ్యుయేట్ ఓటర్ల నుంచి పిడిఎఫ్ అభ్యర్థికి వస్తున్న స్పందన టిడిపి, కూటమి నేతల్లో వణుకు పుట్టిస్తోంది. దీంతో ప్రతి 30 మంది ఓటర్లకు ఒక్కో నాయకుడిని నియమించి అధికార పార్టీ ప్రచారం సాగించడంతోపాటు దగ్గరుండి ఓట్లు వేయించేలా ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఇతర ప్రాంతాల్లోని ఓటర్లను ఆకట్టుకునేందుకు సైతం రకరకాల జిమ్మిక్కులు ప్రయోగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫోన్లు చేసి ఎవరికి ఓటు వేస్తారంటూ ఓటర్ల నిర్ణయం ముందుగానే తెలుసుకునే ప్రయత్నం అధికార పార్టీ చేస్తోంది. రహస్య బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ముందుగా ఓటు ఎవరికి వేసేది చెప్పమని ఎలా అడుగుతారని ఫోన్లు చేసిన వారిపై ఓటర్లు మండిపడుతున్నారు. తమకు ఇచ్చిన ప్రాజెక్టు ఇదంటూ చెబుతున్న తీరు చూస్తే ఎంఎల్సి ఎన్నికలపై టిడిపి ఏవిధంగా భయపడుతుందో అర్థం చేసుకోవచ్చు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచార గడువు ముగియనుంది. 27వ తేదీ పోలింగ్ జరగనుంది. సమయం దగ్గరపడుతున్న కొద్దీ టిడిపి, కూటమి నేతలను ఎన్నికల భయం వెంటాడుతోంది. ఇంత టెన్షన్ ఎప్పుడూ చూడలేదని టిడిపి, కూటమి నేతలే చెబుతుండటం గమనార్హం.

శాసనమండలిలో సామాన్యుల గొంతు వినిపించే వారికే ఓటు

పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల్లో ఓటింగ్‌పై ఓటర్లలో తీవ్ర చర్చ నడుస్తోంది. టిడిపి అభ్యర్థి గెలిస్తే శాసనమండలిలో ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడతారే తప్ప ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడే పరిస్థితి ఉండదనే అభిప్రాయం అందరిలోనూ నెలకొంది. పిడిఎఫ్ అభ్యర్థి గెలిస్తే సామాన్యుల సమస్యలపై శాసన మండలిలో ప్రశ్నించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. గతంలో గెలిచిన పిడిఎఫ్ అభ్యర్థులు శాసనమండలిలో లేవనెత్తిన అంశాలను, సమస్యలపై ఆందోళనలు చేసినప్పుడు పిడిఎఫ్ ఎంఎల్సిలు మద్దతుగా నిలిచిన ఘటనలను ఉద్యోగులు, నిరుద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. దీంతో ఎన్నికలు దగ్గరపడే కొద్దీ పిడిఎఫ్ అభ్యర్థి గురించి ఓటర్లలో ఎక్కువ చర్చ నడుస్తోంది. ఇది అధికార పార్టీ నేతల్లో గుబులు రేపుతోంది.

డివి రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల కష్టాలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, కార్మికుల సమస్యలపై మంచి అవగాహన ఉన్న ఉద్యమ నేత దిడ్ల వీరరాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు బండి రంగారావు పిలుపునిచ్చారు. ఆదివారం వల్లూరు, కాసానివారిపాలెం, నరసింహా రావుపాలెం, శీలంవారిపాలెం, గెద్దాడవారిపాలెంలో ఎంఎల్సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఉన్నత విద్యా వంతులైన దిడ్ల వీర రాఘవులుకు పట్టభద్రులు అంతా విజ్ఞతతో తమ ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్య క్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.మోహన్‌రావు, ఎస్‌విఎన్.శర్మ, బొర్రా రామచంద్ర మూర్తి, కమల్, బొర్రా ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

దుంపగడపలోని బోసురాజకాలనీలో ప్రచారం చేస్తున్న నేతలు

ఆకివీడు: ప్రజా, ఉద్యోగుల సమస్యలపై పోరాటాలకు మద్దతు పలుకుతూ ప్రతి పోరాటానికి ముందుండి నడిపించే వారిని గెలిపించి శాసనమండలికి పంపించాలని సిఐటియు మండల అధ్యక్షులు పెంకి అప్పారావు విజ్ఞప్తి చేశారు. పిడిఎఫ్ ఎంఎల్సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కోరుతూ సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు మండలంలోని దుంపగడప శివారు బోసురాజు కాలనీలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడగా రౌతుల రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో నూరుశాతం ఫలితాలే లక్ష్యం

1వ తేదీ నుంచి 20 వరకూ ఇంటర్ పరీక్షలు

హాజరుకానున్న 37,900 మంది విద్యార్థులు

హాజరుతో సంబంధం లేకుండా ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ హాల్‌టికెట్ జారీ

నాలుగు సిట్టింగ్ స్క్వాడ్‌లు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

డిఐఇఒ ఎ.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు డిఐఇఒ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని, ఈ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 37,900 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. హాజరుతో సంబంధం లేకుండా ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ హాల్‌టికెట్లు జారీ చేస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణకు 52 మంది సూపరింటెండెంట్లు, మరో 52 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, నాలుగు సిట్టింగ్, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు, విద్యార్థుల సన్నద్ధత, ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకున్న లక్ష్యాలు వంటి అంశాలపై ప్రజాశక్తి ముఖాముఖిలో డిఐఇఒ నాగేశ్వరరావు మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి . ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటుకు సంబంధించి 121 ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలలో సుమారు 37,900 మంది విద్య అభ్యశిస్తున్నారు. వీరంతా ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు.

ప్రశ్న: ఇంటర్ పరీక్షలు ఎప్పుడు ప్రారంభం కానున్నాయి. ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు, ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు?

మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 20వ తేదీ వరకు కొనసాగుతాయి. జిల్లావ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 20,437 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 17,032 మంది మొత్తం 37,900 మంది పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న: పరీక్ష ఎంత సమయం వరకు జరుగుతుంది?

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించే ప్రసక్తి ఉండదు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి సమయపాలన పాటించాలి.

ప్రశ్న: పరీక్షల నిర్వహణకు ఎంతమంది అధికారులను, సిబ్బందిని నియమించారు?

52 పరీక్షా కేంద్రాలకు 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించాం. అలాగే నాలుగు సిట్టింగ్ స్క్వాడ్లు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షా కేంద్రాలకు అనుగుణంగా ఇన్విజిలేటర్లను నియమించాం.

ప్రశ్న: పరీక్షలకు హాల్‌టికెట్లు జారీ చేస్తున్నారా?

ఈ నెల 21 నుంచి పరీక్షల హాల్‌టికెట్ల జారీ ప్రారంభించాం. ఆయా కళాశాలలతోపాటు ఇంటర్‌నెట్‌లోనూ హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచాం. ఈ ఏడాది ప్రతి విద్యార్థీ పరీక్షలకు హాజరు కావాలని ముఖ్యోద్దేశంతో ఇంటర్ బోర్డు కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టింది. విద్యార్థుల హాజరుతో సంబంధం లేకుండా ఫీజు చెల్లిస్తే హాల్‌టికెట్లు జారీ చేసి పరీక్షలకు అనుమతించేలా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: ఈ ఏడాది ఉత్తీర్ణత పెంచేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

గతేడాది జిల్లావ్యాప్తంగా 78 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతాన్ని మరింత పెంచాలనే దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నాం. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధతోపాటు నాలుగు యూనిట్లు, క్వార్టర్లీ, హాఫీయర్లీ, ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుని మార్కులు తగ్గడానికి కారణాలు తెలుసుకోవడంతోపాటు అదనంగా మార్కులు సాధించడానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించాం. అలాగే సంకల్పం పేరుతో పని వేళలు పెంచాం. ఇంటర్ బోర్డు నుంచి అందించిన మెటీరియల్‌ను ప్రతి విద్యార్థికీ అందించాం. ప్రతి విద్యార్థీ సులభంగా ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: పరీక్షల నిర్వహణకు ఎటువంటి ఏర్పాట్లు చేశారు?

పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. ప్రశ్నాపత్రాలు అందుబాటులో పటిష్టమైన భద్రత నడుమ ఉంచాం. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పటిష్టంగా అమలుకు చర్యలు చేపట్టాం. అలాగే సెల్‌ఫోన్ రహిత కేంద్రాలుగా ప్రకటించాం. ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలకు అనుమతించడం జరగదు. కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలతోపాటు తాగునీరు అందుబాటులో ఉంచాం. నిరంతరం విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరు కావాలనే ముఖ్యోద్దేశంతో ఆర్‌టిసి బస్సు సర్వీసులను నడిపేందుకు చర్యలు చేపట్టాం. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేశాం.

నేటి నుంచి ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని అంగన్వాడీలకు ఈ నెల 24 నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకూ ఏర్పాటు చేసిన ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో ఆధార్ కార్డు లేని పిల్లలున్న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అంగన్వాడీలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, సిడిపిఒలు అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేసి అవసరమైన ధ్రువపత్రాలతో ప్రత్యేక ఆధార్ క్యాంపులో కొత్త ఆధార్ కార్డులు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు ఆధార్ కార్డులు లేని పిల్లలందరికీ నూరు శాతం కొత్త ఆధార్ కార్డుల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆచంట-2, ఆకివీడు-4, అత్తిలి-3, భీమవరం-6, యలమంచిలి-5, గణపవరం-5, పెంటపాడు-3, ఇరగవరం-2, కాళ్ల-4, మొగల్తూరు-4, నరసాపురం-4, పాలకొల్లు-4, పాలకోడేరు-3, పెనుగొండ-3, పెనుమంట్ర-3 పోడూరు-4, తాడేపల్లిగూడెం-6, తణుకు-2, ఉండి-4, వీరవాసరం-4, భీమవరం-5, నరసాపురం-4, పాలకొల్లు-4, తాడేపల్లిగూడెం-5, తణుకు-6 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సమస్యల తిష్ట బాధాకరం

ఉప విద్యాశాఖాధికారి రమేష్



డివైఇఒ రమేష్‌ను సత్కరిస్తున్న ఎంఆర్‌కె హైస్కూల్ పూర్వపు విద్యార్థులు

ప్రజాశక్తి - వీరవాసరం

జిల్లాలో ఎంతో పేరు, ప్రతిష్టలున్న వీరవాసరం ఎంఆర్‌కె. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోకపోవడంపై జిల్లా ఉప విద్యాశాఖాధికారి నారగన రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రమేష్‌తో పదో తరగతి చదివిన 1986-87 బ్యాచ్ విద్యార్థులు రమేష్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా పాలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ తన పరిధి ఉన్నంత వరకు హైస్కూల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విద్యా చట్టం అమలుకు కృషి చేస్తానన్నారు. హైస్కూల్ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నట్టు తెలిపారు. అంతకు ముందు పలువురు పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ రమేష్ మరింత ఉన్నతాధికారిస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. వీరవాసరం హైస్కూల్‌లో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితులను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం రమేష్, సుభద్ర దంపతులను పూలమాలలతో సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో శనివారపు ప్రసాదు, ముద్రగళ శ్రీనివాస్, యేలూరి భానుకుమారి, గుల్లిపల్లి తులసి, నిమ్మల దుర్గ, గుండా లక్ష్మీ మంగతాయారు, భారతి, వలవల జానకీరావు, రాములు పాల్గొన్నారు.

ఉండిలో పూర్తికాని ఓటరు స్లిప్పుల పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో ఓటరు స్లిప్పులు పంపిణీ ఇంకా పూర్తి కాకపోవడంతో గ్రాడ్యుయేట్ ఓటర్లు తమకు ఓటు హక్కు ఉందో లేదో తెలియని అయోమయంలో ఉన్నారు. ఒక్కో బిఎల్‌ఒకు సుమారు 30 మంది ఓటర్లు ఉండగా స్లిప్పుల పంపిణీ చేయడంలో బిఎల్‌ఒలు పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్ల గ్రాడ్యుయేట్ ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. గ్రాడ్యుయేట్లకు స్లిప్పులు అందకుండానే స్లిప్పులు అందినట్లు మెసేజ్‌లు రావడం పట్ల వారు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. కుర్మావారివీధిలో ఉన్న గ్రాడ్యుయేట్లకు ఇంతవరకూ ఎటువంటి స్లిప్పులూ అందలేదని ఓటర్లు చెప్పడం ఆయా బిఎల్‌ఒ నిర్లక్ష్యం తేటతెల్లమవుతోంది. అసలే ఓటరు జాబితా తప్పులు తడకగా ఉండడం స్లిప్పులు అందకపోవడంతో తాము ఎక్కడికి వెళ్లి ఓటు వేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నామని పలువురు గ్రాడ్యుయేట్ ఓటర్లు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ గ్రాడ్యుయేట్లకు స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి మార్టేరులో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచంట నియోజకవర్గం గ్రిగ్ స్పోర్ట్స్, గేమ్స్ పోటీలు ఈ నెల 24, 25వ తేదీల్లో మార్టేరు శ్రీ వేణుగోపాల ఉన్నత పాఠశాల బసివి రెడ్డి క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ పీడీ పడాల శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, క్రీడలతో పాటు, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందాలు, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, లాంగ్ జంప్ వంటి పోటీలు ఉంటాయని తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పోటీలు జరుగుతాయని తెలిపారు. తరువాత జిల్లా స్థాయిలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి క్రీడాకారులకు శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్నట్లు రిటైర్డ్ పీడీ కృష్ణారెడ్డి తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

భీమవరంలో కొండచిలువ హల్‌చల్

పట్టుకుని అటవీ అధికారులకు అప్పగింత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం టుటౌన్ 36వ వార్డు శివరావుపేటలో రామాలయం వద్ద అన్నాకోడేరు కాలువలో సుమారు 12 అడుగుల కొండ చిలువను ఆదివారం స్థానికులు చూసి భయ భ్రాంతులకు గురయ్యారు. పంట కాలువలో చేపలు తింటున్న కొండచిలువను అక్కడే ఆడుకుంటున్న పిల్లలు చూసి భయభ్రాంతులకు గురై స్థానికులకు తెలియజేయడంతో వెంటనే వారు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. మున్సిపల్ సిబ్బంది కొండచిలువను పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు కొండచిలువను తాడేపల్లిగూడెం దగ్గరలో ఉన్న ఫారెస్ట్‌లో వదిలిపెడతామని తెలిపారు.

రాజశేఖరాన్ని గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - ఉండి

ఎంఎల్‌సి ఎన్నికలు దగ్గర పడడంతో మండల వ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రామకృష్ణంరాజు ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి రాజశేఖరం విజయానికి ప్రచారం ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిరుద్యోగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని, వారికి ఉపాధి కల్పించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాజశేఖరంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, దూసనపూడి రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఉభయగోదావరి జిల్లాల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ మెట్ట ఉప్పరగూడెం, ఇటుకలగుంట, అమృతపురం, మోదుగుంట, ఎల్.అగ్రహారం గ్రామాల్లో టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ వాడపల్లి వెంకట సుబ్బరాజు ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

వృద్ధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించే ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్‌అహ్మద్, ఆర్థో డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ఆదివారం వెంకట్రాయపురం, సజ్జాపురం, తణుకు ప్రాంతాల్లో పర్యటించి 8 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. ఆరిమిల్లి చక్రధరరావు, వేల్పూరు వారి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఉచిత వైద్య సేవలు కోరేవారు 9983343530, 9059290717 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్‌కు చదువే పునాది

టైనీ టాట్స్ డే కేర్ ప్రీ స్కూల్ ప్రారంభించిన సినీనటులు మురళీమోహన్, ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

ఒక ఇంటికి పునాది ఎంత ముఖ్యమో, విద్యార్థుల చదువుకు ప్రారంభ దశలో వేసిన పునాది భవిష్యత్తులో ప్రయోజనకరంగా ఉంటుందని సినీనటులు, పార్లమెంట్ మాజీ సభ్యులు మాగంటి మురళీమోహన్ అన్నారు. ఆదివారం తణుకులో కప్పల వెంకన్న సెంటర్లో టైనీ టాట్స్ నూతన డే కేర్ అండ్ ప్రీస్కూల్‌ను మురళీమోహన్, రాధాకృష్ణ ప్రారంభించారు. తొలుత ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం ప్రముఖ పాత్రికేయులు, దర్శకులు, సుమన్ టివి చీఫ్ ఎడిటర్ (ఫిలిమ్స్) ప్రభ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం భార్యా భర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో పిల్లల్ని ఎవరు చూడాలన్న ప్రశ్న తలెత్తుతోందన్నారు. ఇలాంటి టైంలో ఒక ప్లే స్కూల్‌తో పాటు డే కేర్ సెంటర్ కలిసి పెడితే ఎలా ఉంటుందనే మంచి ఆలోచనతో ఈ స్కూల్ పెట్టారని తెలిపారు. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత స్కూల్ యాజమాన్యంపై ఉందన్నారు. రాధాకృష్ణ విదేశాల్లో ఉద్యోగం, వ్యాపారాలు చేసుకుని డబ్బు సంపాదించే వారని, వాటిని అన్నింటినీ వదులుకుని ప్రజాసేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చారని గుర్తుచేశారు. ఒక మంచి ఎంఎల్‌ఎగా పేరు ప్రతిష్టలు తెచ్చుకోవడమే కాకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాగా ఇష్టపడే వాళ్లల్లో రాధాకృష్ణ ఒకరని తెలిపారు. స్కూల్ కరస్పాండెంట్ ఇనుమర్తి సృజన, సుమన్ టివి చీఫ్ ఎడిటర్ ప్రభ పెద్ద కుమార్తె అని, సినిమా ఇండస్ట్రీలో తనకున్న మంచి మిత్రుల్లో ప్రభ ఒకరు అని తెలిపారు. ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ టైనీ టాట్స్ డే కేర్, ప్రీ స్కూల్ విద్యాసంస్థ రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వావిలాల సరళాదేవి, తణుకు ఎంపిపి రుద్ర ధనరాజు, ఉండ్రాజవరం ఎంపిపి ఎల్లారీశ్వరి, మాజీ వార్డు కౌన్సిలర్ దూలం చిట్టిపాప, స్కూల్ కరస్పాండెంట్ సృజన పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటుడు మురళీకృష్ణ, ఎంఎల్‌ఎ నాయకర్

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

హాస్టల్ చుట్టూ దుర్గంధం

దోమలు, దుర్వాసనతో విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

నిత్యం దుర్గంధం, దోమలతో మండలంలోని పొలమూరు ప్రభుత్వ ఎస్‌సి బాలుర హాస్టల్ మగ్గిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఇరవై సంవత్సరాల క్రితం భీమవరం వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కన నిర్మించిన ప్రభుత్వ ఎస్‌సి బాలుర వసతి గృహం వెనుక నుంచి వెళు న్న కచ్చా డ్రెయిన్ మురికి కూపంగా మారింది. దీనికితోడు చుట్టు పక్కల నివాసితులతో పాటు, పంచాయతీ వారు సైతం ఇక్కడ చెత్త వేయడంతో డంపింగ్ యార్డుగా మారి దోమల పెంపకం కేంద్రంగా, దుర్గంధ కారకంగా మారింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇటీవల ఈ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ నేపథ్యంలో హాస్టల్లో శిథిలమైన నాలుగు టాయిలెట్ల స్థానంలో కొత్తవి నిర్మించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆయా పనులు జరుగుతున్నాయి. ఆ పనుల్లో భాగంగా హాస్టల్ వెనుక పాడైన కచ్చా డ్రెయిన్‌ను పక్కా డ్రెయిన్‌గా నిర్మించి హాస్టల్ విద్యార్థుల, పరిసర ప్రాంత వాసుల ఆరోగ్యం కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

హాస్టల్ వెనుక ఉన్న మురుగు

సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాలు సంపూర్ణ పారిశుధ్యం దిశగా ముందుకెళ్లాలంటే ప్రజల సహకారం అవసరమని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.వెంకటేష్ కోరారు. మండలంలోని జగ్గన్నపేట, వెంకటరామన్న గూడెం గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించడంతోపాటు ప్లాస్టిక్ వినియోగం నిషేధ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించిందని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తొలిమెట్టుగా పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, అల్లూరి సత్యనారాయణ, ఎంఆర్‌సి ఎం.రవికిరణ్, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : మండలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇఒపిఆర్‌డి జి.నరసింహారావు అన్నారు. ఆదివారం కొడమంచిలిలో సచివాలయ సిబ్బంది టీములుగా ఏర్పడి ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ స్థానికులు తమ ఇంటిలో చెత్తను వేరువేరుగా సేకరించి ఇవ్వాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యం మెరుగు పడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.హనుమంతరావు, డిజిటల్ అసిస్టెంట్, ఎం.రవీంద్రబాబు, వెటర్నరీ అసిస్టెంట్, సురేందర్ రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాల సాయి నవీన్ పాల్గొన్నారు.

కొడమంచిలిలో చెత్తను సేకరిస్తున్న అధికారులు

మొగల్తూరు: తడి, పొడి చెత్తను సిబ్బంది వేరుచేసి ఇవ్వాలని ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్ సూచించారు. కాళీపట్నం పడమరలో ఆదివారం ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించారు. గ్రామంలో ఉన్న సంపద కేంద్రం, చెత్త సేకరణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి కవురు సావిత్రి ఆదినారాయణ, కార్యదర్శి మద్దెల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు చేస్తే ఊరుకోం

ఆధారాలు ఉన్నాయి, విచారణకు సిద్ధం - పెన్నాడ పంచాయతీ సర్పంచ్ చిల్లా అనూష

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడ పంచాయతీలో ఎటువంటి అవినీతి జరలేదని, ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని సర్పంచి చిల్లా అనూష అన్నారు. స్థానిక సచివాలయం వద్ద ఆదివారం గ్రామస్తులు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి అనూష మాట్లాడుతూ పంచాయతీలో కోట్లాది రూపాయల అవకతవకలు జరిగాయని కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. కొన్ని ఛానళ్లు కూడా కావాలనే బురద చల్లే ప్రయత్నం చేశాయని తెలిపారు. నిరంతరం గ్రామస్తులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. అటువంటిది తమపై తమ పంచాయతీపై అవినీతి ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. తమపై లేనిపోని ఆరోపణలు చేసిన వారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు బ్రహ్మాజీ, శివ, విక్రమ్, మమత, కళ్యాణి, ఏసు, నామన ఆంజనేయులు, పుష్పలత మాట్లాడుతూ గ్రామస్తులు తమపై ఎన్నుకున్నారని, ఆ విధంగానే గ్రామస్తులకు సేవలందిస్తున్నామని తెలిపారు. అయితే కొన్ని ఛానళ్లు, కొంతమంది తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తమ గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు బాబులు, బ్రహ్మాజీ, రాము, పెంటన్న, పాంద్రాంకి శ్రీను, పిల్లా శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచి అనూష, పాలకవర్గ సభ్యులు

అక్రమ లేఅవుట్లలో హెచ్చరిక బోర్డుల తొలగింపు

రెచ్చిపోయిన పాలకోడేరు రియాల్టర్లు

కేసులు పెట్టేందుకు అధికారులు సిద్ధం

పాలకోడేరు :పాలకోడేరులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోయారు. అనధికార లేఅవుట్‌లో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు రియాల్టర్లు తొలగించారు. ఈ నేపథ్యంలో అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కేసులు పెట్టేందుకు సిద్ధమయ్యారు. పాలకోడేరులో అనధికారిక లేఅవుట్లు విచ్చలవిడిగా వెలిశాయి. ఈ లేఅవుట్లలో అన్ని అనుమతులూ ఉన్నాయంటూ నమ్మబలికి అనధికారికంగా విక్రయాలు చేస్తున్నారు. దీంతో పంచాయతీ అధికారులు వీటికి అడ్డుకట్ట వేశారు. 10 అనధికార లేఅవుట్లలో పంచాయతీ అధికారులు 10 హెచ్చరిక బోర్డులు పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంచాయతీ అధికారులను తమ లేఅవుట్‌లో బోర్డులు ఎందుకు ఏర్పాటు చేశారంటూ నిలదీశారు. అయితే ఈ బోర్డులను ఇటీవల కొందరు రియాల్టర్లు వారే తొలగించారు. ఈ నేపథ్యంలో అనాధికార లేఅవుట్‌లో ఏర్పాటుచేసిన బోర్డులు తొలగించిన వారిపై కేసులు పెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

పాలకోడేరులో అనాధికార లేఅవుట్‌లో తొలగించిన హెచ్చరిక బోర్డులు

భీమయ్యను సత్కరిస్తున్న మానవత సభ్యులు

బిఎస్‌ఎఫ్ లాన్స్ నాయక్ భీమయ్యకు సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

39 సంవత్సరాలపాటు దేశానికి బిఎస్‌ఎఫ్ లాన్స్ నాయక్ హోదాలో విశిష్ట సేవలందించిన నేతల భీమయ్య ఈ ప్రాంత వాసి కావడం గర్వకారణమని మానవత మండల అధ్యక్షులు, విశ్రాంత పీడీ కర్రి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మార్టేరులోని మానవత కార్యాలయంలో జరిగిన భీమయ్య సత్కార సభకు ఆయన అధ్యక్షత వహించారు. నాలుగు దశాబ్దాల కాలం దేశానికి బిఎస్‌ఎఫ్ లాన్స్ నాయక్ హోదాలో సేవలందించినందుకు ప్రభుత్వం గుర్తించి దేశ రాష్ట్రపతి చేతుల మీదుగా పోలీస్ మెడల్‌తో సత్కరించడం గొప్ప విషయమన్నారు. నెగ్గిపూడి గ్రామానికి చెందిన నేతల భీమయ్య బిఎస్‌ఎఫ్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగి గ్రామానికి ఎనలేని కీర్తిని తెచ్చారన్నారు. భీమయ్యను సత్కరించుకోవడం గర్వకారణమని మండల కార్యదర్శి శ్రీనివాసుల మురళీకృష్ణ అన్నారు. సన్మాన గ్రహీత నేతల భీమయ్య మాట్లాడుతూ మార్టేరు గ్రామ ప్రజల మధ్య సన్మానం జరగడం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ దొంగ జయ దుర్గారావు, మానవత సభ్యుడు అమృత వాక్కుల సత్యనారాయణ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి - నరసాపురం

లక్ష్మణేశ్వరంలో దుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నట్లు ఇన్‌ఛార్జి ఇఒ ఆర్‌విఎస్ రామచంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. త్రేతాయుగంలో శ్రీరాముని సోదరుడు లక్ష్మణునిచే స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించబడిందన్నారు. దాతలను జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) ప్రోత్సహించారన్నారు. గోపురం, ఆలయానికి ఆయిల్ పెయింట్స్ సంధ్య మైరెన్స్ కంపెనీ, వెన్నా మురళీకృష్ణ సహాయంతో టైల్స్ వేయించారన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్, పంచాయతీ, రెవెన్యూ, వైద్య సిబ్బందితో పనిచేస్తామన్నారు. చలువ పందిర్లు, లైటింగ్, దాతల సహాయంతో భోజనాలు, మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 24వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి చాగంటి మురళీకృష్ణ, శ్రీదేవి దంపతులచే పాణిగ్రహణ మహోత్సవం జరుగుతుందన్నారు. 25న నిత్యహోమం, బలిహరణ, 26వ తేదీ మహ శివరాత్రి సందర్భంగా రాత్రి స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారన్నారు. ఉదయం 3 గంటల నుండి స్వామి వారి దర్శనాలు ప్రారంభిస్తారన్నారు. 27న సంగీతం - బుర్రకథ, ఆలయ ప్రాంగణంలోని కోనేరులో తెప్పోత్సవం ఉంటుందన్నారు.

నరసాపురం నుంచి రెండు బస్సులు

ప్రజాశక్తి - నరసాపురం

మహాశివరాత్రి సందర్భంగా నరసాపురం డిపో నుంచి ఆచంట శివాలయానికి ఈనెల 26, 27వ తేదీల్లో రెండు బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నరసాపురం డిపో నుంచి పాలకొల్లు, పెనుమదం, గుమ్ములూరు మీదగా ఆచంట శివాలయానికి బస్సు చేరుతుందన్నారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

రోడ్డు ప్రమాదంలో బిజెపి మండల అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

శనివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పెనుమంట్ర మండలం బిజెపి అధ్యక్షుడు కర్రి రామకృష్ణారెడ్డి (58) ఆదివారం తణుకు ఆసపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం తణుకులో ఓ వివాహ వేడుకకు భార్యతో కలిసి బైక్‌పై వెళ్లిన ఆయన తిరిగి వస్తుండగా తణుకు మండలం వేల్పూరు గ్రామం వద్ద వీధి కుక్కలు వెంటపడడంతో బండి మీద నుంచి దంపతులు ఇద్దరూ జారిపడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ రామకృష్ణారెడ్డిని వెంటనే తణుకు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించి ఆయన ఆదివారం సాయంత్రం మృతి చెందారు.

వరుస చోరీ కేసుల్లో ఆరుగురు అరెస్టు

రూ.10 లక్షల 20 వేల విలువైన వస్తువులు స్వాధీనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వరుస దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను హడలెత్తిస్తున్న ఆరుగురు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, 33 గ్రాముల బంగారం, 1/2 కేజీ వెండి, మూడు సెల్‌ఫోన్లు, రూ.85,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్‌పి భీమారావు తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చోరీ వివరాలను వివంచారు. భీమవరం రాయలం గ్రామానికి చెందిన అనుపోజు కృష్ణవంశీ, భీమవరం పట్టణానికి చెందిన ఓలేటి దుర్గా మల్లేశ్వరరావు, దగరపు ఎలియజర్, చాగల్లు గ్రామానికి చెందిన డొక్కు సాయికిరణ్, ఆకివీడు మండలం తాళ్లకోడు ప్రాంతానికి చెందిన నరమామిడి హరిబాబు, ఒక మైనరుపై జిల్లాలోని తాడేపల్లిగూడెం, ఉండి, కాళ్ల, కైకలూరు టౌన్, భీమవరం టూ టౌన్, భీమవరం టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బృందాలుగా ఏర్పడి అతి తక్కువ కాలంలోనే నిందితులను పట్టుకుని వారి వద్ద నుండి భారీ మొత్తం రూ.10 లక్షల 20 వేలు విలువైన ద్విచక్ర వాహనాలు, బంగారం, వెండి, నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేశారు. సమావేశంలో డిఎస్‌పి ఆర్‌జె.సూర్య, వన్ టౌన్ సిఐ నాగరాజు, ఎస్‌ఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పరకాల శేషావతారం కాలువ పనులను ఆదివారం పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాలువపై శ్రద్ధ చూపకపోవడంతో కాలువ మొత్తం పూడుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విప్ బొమ్మిడి నాయకర్ ఆదేశాల మేరకు తీర ప్రాంతాలకు సాగు, తాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నరసాపురం నుండి పితానిమెరక వరకూ మూడు కిలోమీటర్లు పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల ప్రజలకు సాగు, తాగునీరు సమృద్ధిగా అందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనుల్లో అలసత్వం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మార్రాజు వెంట ఇరిగేషన్ డిఇ సిహెచ్ వెంకట నారాయణ ఉన్నారు.

కాలువను పరిశీలిస్తున్న మార్రాజు

రోజుకు 18 గంటలు పని చేస్తున్నా : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రజల కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తున్నానని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి రాజశేఖరం గెలుపు కోరుతూ కూటమి నాయకులు విస్తృతస్థాయి సమావేశం పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో 3 సార్లు ఎంఎల్‌ఎగా గెలిచానని, నేడు మంత్రిగా ఉన్న ప్రజాసేవలో రోజుకు 18 గంటలు శ్రమిస్తున్నానని చెప్పారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో రాజశేఖరం గెలుపు ఏకపక్షం కావాలని, అందుకు ఆయనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను కలిసి కోరాలని అవసరం ఉందన్నారు. ఆయన వెంట మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా నడిస్తే ఆరోగ్యానికి మేలని ఊపిరితిత్తులు, ఛాతి వైద్య నిపుణులు సంక వెంకట సుబ్రహ్మణ్య పాపారావు అన్నారు. రాజమండ్రిలోని నిత్య క్లినిక్ ఆధ్వర్యంలో మొగల్తూరు 5కె వాక్‌ను మొగల్తూరులోని గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పాపారావు మాట్లాడారు. మధుమేహం, రక్త పోటు తదితర రోగాలు దరి చేరవన్నారు. గుండె, ఎముకలు, కండరాలు బలపడతాయని, మానసిక ఒత్తిడి ఉండదని తెలిపారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్ఞాన మునీశ్వర విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు గ్రామంలో గుణ్ణం చెరువుగట్టు వద్ద జ్ఞాన మునీశ్వర విగ్రహ ఆవిష్కరణ ఆదివారం జరిగింది. స్థానిక దేవాంగ విశ్వబ్రాహ్మణ రజక హిందూ శ్మశానవాటిక అభివృద్ధిలో భాగంగా జ్ఞాన ముద్రలో ఉన్న జ్ఞాన మునీశ్వరుని విగ్రహం ఆవిష్కరణ చేసినట్టు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టేరు గ్రామ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు, పంచాయతీ వార్డు మెంబరు అల్లాడ కుమారస్వామి, కోశాధికారి రోబ్బి భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ప్రథమ స్థానం సాధించడమే లక్ష్యం

ఉండి:త్వరలో జరిగే పదో తరగతి పరీక్షలలో ప్రతి విద్యార్థి ప్రథమ స్థానం సాధించడమే లక్ష్యంగా విద్యాబోధన చేయడం జరుగుతోందని శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాస్ అన్నారు. తమ పాఠశాలలో 32 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని. వారిలో 17 మంది ఏ గ్రేడ్, 15 మంది బి గ్రేడ్ విద్యార్థులు ఉన్నారని అన్నారు. సిలబస్ పూర్తయ్యిందని, ఉదయం సాయంత్రం, అదనపు తరగతులు నిర్వహించి పాఠ్యాంశాలను పున్ణశ్చరణ చేయించడం జరుగుతుందని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెరిగి సబ్జెక్టుపై అవగాహన మరింత పెరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరమూ తమ పాఠశాల నుంచి మండల స్థాయి ర్యాంకు తెచ్చుకోవడం జరుగుతుందని, ఈ సారి కూడా ర్యాంకును పదిలం చేసుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు.

ఎంఎంకెఎన్‌ఎం ప్రతిభా పాటవ పోటీలు

పాలకొల్లు : విద్య చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఎంఎంకెఎన్‌ఎం హైస్కూల్లో ప్రతిభా పాటవ పరీక్ష పాలకొల్లు డివిజన్ స్థాయిలో జరిగింది. పాలకొల్లు పట్టణం, మండలం, పోడూరు, యలమంచిలి, ఆచంట, వీరవాసరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 7, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించారు. తొమ్మిదో తరగతికి వ్యాసరచన పోటీ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ అధ్యక్షత వహించారు. శ్రీశ్రీ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఈ పరీక్షను నిర్వహించి ప్రతిభావంతులను గుర్తించి వారికి నగదు బహుమతులు అందజేస్తున్నామని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యకు సాయం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథి న్యూ లైఫ్ హాస్పిటల్ వైద్యులు ఎం.లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ తాను కూడా చిన్నప్పుడు ఒక మూలన కూర్చునే వాడినని, వెనుకబడిన విద్యార్థినని, తర్వాత ఒక లక్ష్యంతో చదివి ఈ స్థాయికి చేరుకున్నట్టు తెలిపారు. విద్యార్థులందరూ ఒత్తిడి లేని విద్యను అలవర్చుకోవాలన్నారు. హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పితాని ధర్మారావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని తెలివితేటలు వెలుగులోకి వస్తాయని, ఇది ఒక మంచి అవకాశమని తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

మొగల్తూరు:ప్లాస్టిక్ సామగ్రి వినియోగిస్తే చర్యలు తప్పవని తెలియజేస్తూ ఆదివారం మొగల్తూరులో ప్రచారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఆటోలపై ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధం అమలుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. దుకాణాల్లో విక్రయించినా, వినియోగించినా అపరాధ రుసుము విధించడంతోపాటు వ్యాపార లైసెన్సులు రద్దు చేస్తామని అన్నారు.

దస్తావేజు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, వీకర్స్‌కాలనీ, 1వ వార్డుకు చెందిన కాకర్లమూడి సతీష్ కుమార్ గారి భార్య కాకర్లమూడి వనజ చెందిన ఓరిజినల్ స్థలం దస్తావేజు పోయినది. దస్తావేజు నెం. 4918/2023 గునిపల్లి ఎస్.ఆర్.ఓ. గల దస్తావేజు ది. 14-02-2025 తేదీన జిరాక్స్ తీసుకొను నిమిత్తం తాడేపల్లిగూడెంలోని బస్టాండ్ నుండి తాలూకా ఆఫీసు వైపు వెళ్లుచుండగా మార్గమధ్యమున పోయినది. నా ఓరిజినల్ దస్తావేజు దొరికిన వారు టౌను పోలీసు స్టేషనులో గాని,క్రింది అడ్రసుకు గాని అందించగలరు.

కాకర్లమూడి వనజ
W/o కాకర్లమూడి సతీష్ కుమార్
తాడేపల్లిగూడెం, ప.గో॥జిల్లా
సెల్: 9182851469
8500739998